

# విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

**బర్కత్‌పుర, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి):** బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌ను పూర్తిగా విజయవంతం అయ్యిందని, అందుకు సహకరించిన విద్యా సంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. ఆదివారం కాచిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ బంద్ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. మోదీ ప్రభుత్వం తక్షణమే బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని కోరారు. గవర్నర్ సైతం జీవో 9ను ఆమోదించాలని డిమాండ్ చేశారు.






దొంతులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

# దీపావళి శోభ

**చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):** దీపావళి పండగ సందర్భంగా జనాలతో మార్కెట్ ఆదివారం కిటకిటలాడింది. ధన లక్ష్మీ పూజకు అవసరమైన సామగ్రి, లక్ష్మీపటాలు, దొంతులు, ఫ్యాన్సీ ముగ్గులు, రంగులు, విద్యుత్ దీపాలు, తోరణాలు, ఫ్యాన్సీ ప్రమిదలు గృహ అలంకరణ, వివిధ రకాల ఫ్యాన్సీ వస్తువులు, ప్రతిమలు తదితర వస్తువులు కొన్నారు. వీరి రాకతో మార్కెట్, ప్రముఖ కూడళ్లు రద్దీగా కనిపించాయి.

## బాణసంచా షాపులవారు నిబంధనలు పాటించాలి

బాణాసంచా షాపుల వారు నిబంధనలు పాటించాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ సూచించారు. బాణసంచా షాపుల వద్ద అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తప్పవన్నారు. బాణసంచా కాల్చే సమయంలో చిన్నారులను గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటూ బాణసంచా కాల్చాలని పండగను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

## అరుణ కుమారికి సన్మానం

**ముషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):** యోగాసన పోటీల్లో ప్రతిభచూపిన పీ అరుణకుమారిని తెలంగాణ యోగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఎస్.ఎన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డిలు సన్మానించారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లోజాతీయ స్థాయి 50వ జాతీయస్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో కాంస్య పతకం పొందారు. అరుణ కుమారి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహగౌడ్, కార్యదర్శి మంజుల, కోశాధికారి రాజు, సంయుక్త కార్యదర్శి వినోద్ కుమార్, సభ్యులు రాజశేఖర్, రాణి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.




అరుణ కుమారిని సన్మానిస్తున్న ఎస్ఎన్ రెడ్డి

## నేడు సదర్ సమ్మేళనం

● అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్

**బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):** కాచిగూడ డివిజన్ నింబోలి అడ్డ మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద దీపావళి పర్వదినం సందర్భంగా సోమవారం సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కన్నె రమేష్ యాదవ్ తెలిపారు. మలక్‌పేట, నూర్‌ఖాన్ బజార్, ఆజంపూర, చెంచల్‌గూడ, గోల్నాక, అంబర్‌పేట, రామంతపూర్ తదితర ప్రాంతాల నుంచి దున్నపోతులను అలంకరించి బ్యాండ్‌మేళాలతో తీసుకువస్తారని, వీటికి మెడల్స్ అందజేస్తామని తెలిపారు. వేడుకల్లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌లు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రులు కృష్ణాయాదవ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్, బాబూరావు యాదవ్, నిరంజన్ యాదవ్, జగ్గు యాదవ్, రవీందర్ యాదవ్, మురళీ యాదవ్ తదితరులు కూడా పాల్గొంటారని తెలిపారు.

## లక్ష్మీగణపతి ఆలయంలో కార్తీకమాస మహోత్సవాలు

**చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలో క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో కార్తీక మాస మహోత్సవాలు ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు జరుగుతాయని ఆలయ లక్ష్మారెడ్డి, పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ ఎం. నర్సింగ్‌రావు తెలిపారు. 25న నాగచవితి, నాగదేవతలకు అభిషేకం, 27న క్షీరాభిషేకం, నవంబరు 2న తులసీలగ్నం, 5న సామూహిక సత్యనారాయణవ్రతాలు, సాయంత్రం 7 గుంటలకు జ్వాలాతోరణం, 9న మహాలింగార్చన, 17న ఘృతశర్కరాభిషేకం, 18న మాసశివరాత్రి సందర్భంగా భస్మార్చన, సాయంత్రం 6 గంటలకు శ్రీ ఉమామహేశ్వరకల్యాణంఉంటుందని ప్రతిరోజు ప్రత్యేకపూజలుంటాయని భక్తులు ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## సేవా భావాన్ని అలవర్చుకోవాలి

**ముషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):** ప్రతిఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని పేదలను ఆదుకోవాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ రేయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలు నివసించే ప్రాంతాలలోని వారిని ఆదుకునేందుకు దాతలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పేదలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, వేదాంత్ రెడ్డి, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాల చోరీ

**బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):** రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బేగంబజార్‌కు చెందిన వర్ష రంజిత్ రవి (40) ఈనెల 17న మన్మాడ్‌లో అజంత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. 18న కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దిగి ఇంటికి వెళ్లిన తర్వాత లగేజీ బ్యాగ్‌ను పరిశీలిస్తే అందులో ఉన్న పరుసు కనిపించలేదు. ఇందులో 58గ్రాముల బంగారు ఆభరణాలున్నాయి. వర్ష ఆదివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.














దీపావళి పండగను పురస్కరించుకొని ముషీరాబాద్ సీఐ రాంబాబును కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోక నవీన్, మన్నె దామోదర్ రెడ్డి, ముదిగొండ మురళీ, జ్ఞానేశ్వర్‌గౌడ్, శివ తదితరులు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. - (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

# బీ-ఫామ్ అందజేత



జేఎస్‌రావుకు బీ-ఫామ్ అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్

కవాడిగూడ , అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో జరిగే ఉపఎన్నికల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా జేఎస్‌రావుకు పార్టీ బీ-ఫామ్ అందజేసినట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. ఆదివారం దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యకర్తలతో చర్చించి జూబ్లీహిల్స్ నియోజకవర్గం దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా ప్రకటించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ మూడు ప్రధాన దోపిడీ పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లాండ్, లిక్కర్, రియల్ ఎస్టేట్ మాఫియాలతో సామాన్య పౌర సమాజానికి అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అడ్డుకోవాలంటే దళిత బహుజన పార్టీ తరఫున బలపరిచిన అభ్యర్థి జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి ( ఎన్‌డీఎస్ఎఫ్ ) బలపరిచిన జెస్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌డీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కోళ్ల సుధాకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



షేక్‌పేట.. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బాలకిషన్

## మాలసంఘాల జేఏసీ ఛైర్మన్ బాలకిషన్ నామినేషన్

జూబ్లీహిల్స్ అభ్యర్థిగా తాను నామినేషన్ వేశానని మాలసంఘాల జేఏసీ ఛైర్మన్ బేర బాలకిషన్ తెలిపారు. షేక్‌పేటలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీ అంబేడ్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 200 మంది వరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నామినేషన్లు వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మాలల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పోటీ చేస్తున్నానని, ఈ విషయమై నియోజకవర్గం ప్రజలు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎమ్మెల్యే కాలేరు దీపావళి శుభాకాంక్షలు



రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఈ పండగ అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు, సంతోషాలు నింపాలని పేర్కొన్నారు. వారికి అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. టపాసులు కాల్చేటప్పుడు పిల్లలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



## బాగ్అంబర్‌పేట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

● కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



రాంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాగ్అంబర్‌పేట డివిజన్ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బి. పద్మావెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె విలేరులతో మాట్లాడుతూ డివిజన్‌లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేశామని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాలలో వీధిదీపాల ఏర్పాటు చేశామన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. డ్రైనేజీ, కలుషిత నీరు వంటి సమస్యలు లేకుండా రోజూ పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ ప్రజలకు ఆమె దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.




కొండూరు హరినారాయణరెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

## కృతి ఆర్ట్స్ అసోసియేషన్ సంస్థ ఏర్పాటు

చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కృతి ఆర్ట్స్ అసోసియేషన్ పేరిట నూతన సాంస్కృతిక సంస్థ ఆదివారం ఆవిర్భవించింది. త్యాగరాయగానసభలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు గాయనీ గాయకులు సినీగీతాలను మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభలో కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండూరు హరినారాయణరెడ్డిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అంజనీ కృష్ణప్రసాద్ బండి, కార్యక్రమ సహనిర్వాహకురాలు, నవరసగాయని ఆమని, కుసుమ భోగరాజు, శ్రీదేవి, రమాప్రభ, స్నేహభారతి, రజిత, వల్లికార్తికేయ, ఉదయ్ ముద్గల్, తిరుపతిరెడ్డి,రవి, శ్రీమణి, సుభాష్, నందూరి లక్ష్మణ్, మురళి, మూర్తి, శ్రీకాంత్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి కేటీఆర్‌కు సదర్ వేడుకల ఆహ్వాన కార్డును అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిబాబు

## సదర్ ఉత్సవాలకు రండి

ముషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సదర్ వేడుకలకు హాజరుకావాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎండ్ల హరిబాబు యాదవ్ ఆహ్వానించారు. ఆదివారం ఆయన్ను కలిసి ఆహ్వాన కార్డును అందజేశారు. ఈ సందర్భంగా సదర్ వేడుకల వివరాలను, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల నుంచి భారీ దున్నలను ఉత్సవాలకు తీసుకు వచ్చామని కేటీఆర్‌కు వివరించారు. వైభవంగా నిర్వహించే ఈ వేడుకలకు రావాలని కోరారు. అనంతరం ఉత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వరుణ్ యాదవ్, అభినందన్ యాదవ్, సాయి యాదవ్, వీరేష్, వేణు యాదవ్, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ బాకీ కార్డు సభకు కూడా..

చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్‌ను నిరుద్యోగులు జేఏసీ ఆహ్వానించింది. ఈనెల 24న జలవిహార్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈసందర్భంగా నిరుద్యోగ జేఏసీ నేతలు కయ్య వెంకటేష్, శంకర్‌నాయక్, రవికుమార్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. నిరుద్యోగ జేఏసీ నేతలు నవీన్‌పట్నాయక్, రవి, శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాలపై దాడి ఘటనల్లోని

# బీసీ నేతల అరెస్టు, విడుదల

బర్కత్‌పుర అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌లో దుకాణాలపై దాడులు చేసిన 8 మంది బీసీ నేతలను పోలీసులు అరెస్టు, విడుదల చేశారు. కాచిగూడ, నల్లకుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లకుంట పీఎస్ పరిధిలో శంకర్ మఠం వద్ద బజాజ్ షోరూంపై, కాచిగూడ పీఎస్ పరిధిలో బర్కత్‌పుర చౌరస్తా వద్ద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌లపై బీసీ సంఘాల నేతలు దాడులు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ(56), పి.రాందేవ్ మోదీ(30), రామ్ కోటి ముదిరాజ్(47), సాయి నిఖిల్(24), టి.రాజ్ కుమార్ (45), కే సాయిబాబా(30), పి.తేజ(31) ఎ.రామ్మూర్తిగౌడ్(39)లను ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బీఎన్ఎస్ 189 (2), 191 (2), 324 (4), 190 సెక్షన్‌ల కింద వారిపై కేసులు నమోదు చేశారు. వైద్య పరీక్షలు అనంతరం కోర్టులో హాజరుపరిచారు. వారికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయగా విడుదలయ్యారు.

### అర్ధరాత్రి అరెస్టా? : ఎంపీ ఆర్ కృష్ణయ్య

ఎనిమిది మంది బీసీ నేతల అరెస్టుపై రాజ్యసభసభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగలు, నక్సలైట్ల మాదిరిగా అర్ధరాత్రి అరెస్టు ఏ విధంగా చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి గెలుపుపై ధీమా

చిక్కడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి గెలుపుపై పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తరఫున వెంగళరావు నగర్ డివిజన్ 122 పోలింగ్‌స్టేషన్ ఇన్‌చార్జి, ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌కు చెందిన పార్టీ నేతలతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో హరిబాబు, ఆనంద్‌రావు, నేతలు విఠల్, జ్ఞానేశ్వర్, రాజ్‌కుమార్, ప్రశాంతి, జగదీష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## సునీత తరఫున ప్రచారం

ముషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరఫున ముషీరాబాద్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు శివముదిరాజ్, సయ్యద్ అహ్మద్‌భక్తియార్, జావిద్‌ఖాన్, మోహిన్ తదితరులు ఓటర్‌లను కలిసి సునీతను గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, శ్రీకాంత్ యాదవ్, నాని, భాస్కర్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.